## • 'డబుల్ ఇండ్ల'కు ట్యాంకరే దిక్కు!



*నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి*

## • పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



*రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట*



*గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు*

## గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

# గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



*ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు*



*ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం*

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




*వీర్ల నర్సవ్వ　ఆది రాజవ్వ*

### మహా కుంభమేళాకు వెళ్లి ..

**తప్పిపోయిన జగిత్యాలవాసులు**

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

### చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ–1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.




*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు*

## దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

### సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

**జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్**

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



### ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

## ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.



*లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు*

## ఉద్యోగుల సేవలు మరువలేనివి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ గౌరిశెట్టి బాలచంద్రం ఉద్యోగ విరమణ



*ఏడీ బాలచంద్రంను సన్మానిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్*

కలెక్టరేట్, జనవరి 31 : ఏడీ సర్వే గౌరిశెట్టి బాలచంద్రం సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఏడీ సర్వే గౌరిశెట్టి బాలచంద్రం ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ హాజరై మాట్లాడారు. గౌరిశెట్టి బాలచంద్రం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలో దాదాపు 32 ఏండ్ల సేవలు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఇక్కడ సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాధాభాయ్, రాజేశ్వర్, జిల్లా పశువైద్యాధికారి రవీందర్ రెడ్డి, ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రధానోపాధ్యాయుడి ఉద్యోగ విరమణ

కోనరావుపేట, జనవరి 31: మండలంలోని నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న పులి తిరుపతయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ఎంఈవో మురళీనాయక్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపకను అందజేశారు. ఇక్కడ ఆదర్శ చైర్మన్ దుంపటి రమ, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు ప్రభాకర్ తదితరులున్నారు.

### ఏఎస్ఐకి సన్మానం

ఎల్లారెడ్డిపేట, జనవరి 31: కొంతకాలంగా ఎల్లారెడ్డిపేటలో ఏఎస్ఐగా విధులు నిర్వహించి ఈ నెల 31న ఉద్యోగ విరణ పొందుతున్న ఏఎస్ఐ కిషన్‌రావును సీఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడి కిషన్‌రావు–దంపతులను శాలువాతో సత్కరించారు. ఇక్కడ ఎస్ఐ రమాకాంత్, సిబ్బంది,మాజీ సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, తదితరులున్నారు.

### పౌర హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

రుద్రంగి, జనవరి 31: పౌర హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ యాదగిరి అన్నారు. పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకొని రుద్రంగి మండలం బడితండా గ్రామ పంచాయతీలో డిప్యూటీ తహసీల్దార్ యాదగిరి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతరాజ్యాంగం ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. ఇక్కడ ఎంఈవో రామకృష్ణ, నాయకులు గజన్‌లాల్, రాందాస్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులున్నారు.

### కొదురుపాక ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ


వేములవాడ, (బోయినపల్లి), జనవరి 31: కొదురుపాక గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి రామకృష్ణ తనిఖీ చేశారు. అసంక్రమిత వ్యాధులపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మధుమేహం, క్యాన్సర్ వ్యాధుల స్క్రీనింగ్, పలు రికార్డులను పరిశీలించి, రోగి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇక్కడ వైద్యాధికారి రేణుప్రియాంక, ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ, ఎన్ఎం లక్ష్మమ్మ తదితరులున్నారు.

### పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

రుద్రంగి/చందుర్తి , జనవరి 31:రుద్రంగి, చందుర్తి మండల కేంద్రాలతోపాటు బడితండా గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మండల వైద్యాధికారి సంపత్‌తో కలిసి జిల్లా వైద్యాధికారి రజిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఇక్కడ మండల వైద్యాధికారి సంపత్ కుమార్, వైద్యాధికారులు రేఖ, కార్తీక్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

# 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- నేరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులకు పాఠాలు చెప్పిన కలెక్టర్



*తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా*

సిరిసిల్ల రూరల్, జనవరి 31 : పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గది, వండే విధానాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం ఈ రోజు ఏ ఏ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారో ఆరా తీశారు. కూరగాయలు పప్పు, కోడిగుడ్లు సిద్ధం చేస్తుండగా, నాణ్యతను తనిఖీ చేశారు. ఈరోజు ఎందరు విద్యార్థులు, టీచర్లు హాజరయ్యారో ఆరా తీశారు. మొత్తం 84 మంది విద్యార్థులు, టీచర్లందరూ వచ్చారని కలెక్టర్ దృష్టికి ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్ తీసుకెళ్లారు. కాగా, స్కూల్‌లోని 6వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ పాఠా లు బోధించారు. విద్యార్థులకు మ్యాథ్స్ ప్రశ్న లు వేసి, సమాధానాలు రాబట్టారు. విద్యార్థులను ఉత్తేజ పరిచారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను సిద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా వివరించాలని పేర్కొన్నారు.

# ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి
- ఎమ్మెల్సీ ఎన్నికలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



*కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్‌కు హాజరైన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్*

కలెక్టరేట్, జనవరి 31 : శాసన మండల సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని అదనపు కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ శాసన మండలి సభ్యుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 28 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 21 వేల 614 మంది ఓటర్లు, ఉపాధ్యాయులకు సంబంధించి 13 మండలాల పరిధిలో 874 మాది ఓటర్లున్నారని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో కలెక్టరేట్ సీ సెక్షన్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఎన్నికల సిబ్బంది పాషా రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

### సులభ కాన్పుపై యోగా శిక్షణ

వేములవాడ, జనవరి 31: వేములవాడ ఏరియా దవాఖానలో గర్భిణులు యోగా శిక్షణను అందిస్తున్నట్లు ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య శుక్రవారం తెలిపారు. సాధారణ కాన్పుతో మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటారని, ప్రభుత్వం నియమించబడిన ఆయుష్మాన్ విభాగానికి చెందిన యోగా శిక్షకులు ఎలిగేటి కృష్ణ యోగా శిక్షణను అందిస్తున్నారని తెలిపారు. గర్భిణులతోపాటు దవాఖానకు వచ్చే ఇతరులు కూడా యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.

### మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టెస్టు

ఇల్లంతకుంట, జనవరి 31 : మండల కేంద్రంలోని విద్యా వరనుల కేంద్రంలో విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించామని మండల విద్యాధికారి శ్రీనివాస గౌడ్, సూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రేమలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ, గురుకుల, ఆదర్శ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ టాలెంట టెస్టును నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పెద్దలింగాపూర్ హెచ్ఎం తిరుపతి, గాలిపెల్లి హెచ్ఎం పావని, మధుసూధన్ రావు, ఉపాధ్యాయులున్నారు.

### కాపర్‌వైర్ దొంగ అరెస్టు

ఎల్లారెడ్డిపేట, జనవరి 31: మండల కేంద్రంలోని మడేలమ్మ ఆలయంలో కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లిన దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 8న వంద గజాల కాపర్‌వైర్‌ను మడేలమ్మ ఆలయం వద్ద నుంచి ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దీటి నర్సయ్య ఠాణాలో ఫిర్యాదు చేశాడు. మండల కేంద్రంలోని బైపాస్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా గజసింగవరం రాజరాజేశ్వర కాలనీకి చెందిన శివరాత్రి శ్రీనివాస్ విద్యుత్‌వైర్ (కాపర్)తో దొరికినట్లు ఎస్ఐ తెలిపారు. దీంతో శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

### పోతుగల్ సంఘాన్ని సందర్శించిన మహారాష్ట్ర బృందం



*పోతుగల్ సహకార సంఘాన్ని సందర్శిస్తున్న మహారాష్ట్ర బృందం సభ్యులు*

ముస్తాబాద్, జనవరి 31: మండలంలోని పోతుగల్ వ్యవసాయ సహకార సంఘాన్ని శుక్రవారం మహారాష్ట్ర సతార జిల్లా వికాస్ సొసైటీ బృందం సందర్శించింది. సంఘ చైర్మన్ వీకే మోతె ఆధ్వర్యంలో పాలకవర్గం పోతుగల్ సంఘానికి విచ్చేశారు. సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న ఆయా రుణాలు, డ్రోన్ ద్వారా పంటలకు పిచికారీ, పెట్రోల్ బంక్‌ల నిర్వహణ తదితర అంశాలపై వారు మహారాష్ట్ర బృందానికి వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ బాపురావు, సీఈవో కృష్ణ, పాలకవర్గ సభ్యులున్నారు.

## సాయిచరణ్ మృతిపై విచారణ జరిపించాలి



*భగీరథ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు*

కలెక్టరేట్/వేములవాడ రూరల్, జనవరి 31 : నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండల మిషన్ భగీరథ ఏఈఈ సాయి చరణ్ కనీసం ఆరు నెలలు కూడా గడవక ముందే ఆత్మహత్య చేసుకోవటం చాలా బాధాకరమని, సాయి మృతిపై విచారణ జరిపించాలని మిషన్ భగీరథ ఇంజినీరింగ్ విభాగాల ఏఈలు, అధికారులు కోరారు. శుక్రవారం అగ్రహారం వద్ద భగీరథ (ఇంట్రా) కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఇందుకు బాధ్యత వహిస్తూ ఉన్నతాధికారులు స్పందించి విచారణ కమిటీ ఏర్పాటు చేసి నిజనిజాలు పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్స్ ఇంజినీర్స్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి, సెక్రెటరీ బొల్గం సాగర్, కోశాధికారి విశ్వాన్ డిమాండ్ చేశారు. కాగా మిషన్ భగీరథ (ఇంట్ర) అగ్రహారం కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ సాయి చరణ్ ఆత్మకి శాంతి కలుగాలని 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లాలో పనిచేస్తున్న అన్ని ఇంజినీరింగ్ విభాగాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అధికారులు పాల్గొన్నారు.

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక



*ప్రధాన కార్యదర్శిగా తిరుపతికి నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు*

కోనరావుపేట, జనవరి 31: మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన వీరబోయిన తిరుపతియాదవ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కారదర్శిగా నియమించినట్లు మండలాధ్యక్షుడు కీసరి శ్రీనివాస్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా వంగాల భూమేశ్ గౌడ్, కార్యదర్శిగా శ్రీనివాస్, ఎన్నుకొన్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు పరశురాం, ఉపాధ్యక్షుడు బిల్లా వెంకటరాములు తదితరులున్నారు.